

● ధర్పల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎండీవో

బీజేపీ సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో ఇందూరు

● చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పెద్దబజార్, సెప్టెంబరు 10: బీజేపీ సభ్యత్వ నమోదులో తెలంగాణలోనే ఇందూరు మొదటి స్థానంలో ఉందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు రెండు లక్షల టార్గెట్ ఉందని, అంతకు మించి లక్ష్యాన్ని పూర్తి చేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. బూత్ స్థాయిలో విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి బాధ్యతగా పని చేయాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు రాజకీయాలకు సంబధం లేదని చెప్పారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో 60శాతం బీజేపీ అభ్యర్థులే గెలవాలని ఆయన ఆకాంక్షించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. బీజేపీకి అండగా ఇందూరు కార్యకర్తలు ఎల్లప్పుడు ముందువరుసలో ఉంటారని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం అంటే భరోసా అని, కార్యకర్తల బలంతోనే తాను గెలిచానని సభ్యత్వ నమోదులోనూ వారి బలంతో ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, రాష్ట్ర నాయకులు లోక భూపతిరెడ్డి, పుప్పాల శివరాజ్, బద్దం లింగారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మినారాయణ, మున్సిపల్లి ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నేమూరి నర్సగౌడ్, అనిల్‌కుమార్, స్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం

- స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా అధికారులు
- వార్డుల వారీగా ఓటరు జాబితా పరిశీలన
- ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్న ఆశావహులు

నిజామాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకున్నా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో వార్డుల వారీగా ఓటరు లిస్టును పరిశీలిస్తున్నారు. పంచాయతీల పరిధిలోని ఓటర్లను పరిశీలించడంతో పాటు ఎన్నికల నిర్వహణకు ముందే జాబితాను సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితాతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఎన్నికలపై ఇంకా నిర్ణయం తీసుకోకున్నా గ్రామ పంచాయతీల పరిధిలో పార్టీల నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాల్లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ రహితంగా సర్పంచ్ ఎన్నికలు జరిగిన ఆయా పార్టీల మద్దతుతోనే గత కొన్నేళ్లుగా గెలుస్తుండటంతో ప్రధాన పార్టీల నేతలు ఆ ప్రయత్నాలను చేస్తున్నారు. మరికొంత మంది మండల స్థాయి పదవులను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 545 గ్రామ పంచాయతీలు

జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత పాలకవర్గాలు ముగిసే సమయానికి 530 గ్రామ పంచాయతీలు ఉండగా ఈ మధ్యనే కొత్తగా మరో 15 గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. గ్రామ పంచాయతీల పాలకవర్గాలతో పాటు మండల ప్రజాపరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాలు ముగిశాయి. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతోంది. ఫిబ్రవరి మొదటి వారంలో గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియగా మండల ప్రజాపరిషత్, జడ్పీ సభ్యుల పదవీకాలం జూలై మూడవ తేదీతో ముగిసింది. అప్పటి నుంచి అన్ని కార్యక్రమాలు అధికారుల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోకున్నా ముందస్తుగా ఏర్పాట్లను చేయాలని ఆదేశాలను ఇచ్చింది.

5020 వార్డుల్లో ఓటరు జాబితా పరిశీలన..

జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 5020 వార్డుల్లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను అనుసరించి వార్డుల వారిగా విభజిస్తున్నారు. ఈ ఎన్నికలు గ్రామ పంచాయతీల పరిధిలో వార్డుల వారిగా జరుగనుండటంతో వాటి పరిధిలోనే జాబితా సిద్ధం చేస్తున్నారు. మిగతా ఎన్నికలను పోలింగ్ కేంద్రాల వారీగా నిర్వహించగా స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రం వార్డుల వారిగా జరగనుండటంతో ముందస్తుగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారులు గ్రామాల పరిధిలో వార్డులను అనుసరించి ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికలకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు సంబంధించి కూడా నివేదికను సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ ద్వారా జరగనుండటంతో ఈ ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. వార్డులకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుండటంతో ఆయా గ్రామాల పరిధిలో పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నారు.



ముప్కాల్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ (ఫైల్)

పోటీకి ఆశావహుల సన్నద్ధం..

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా పోటీ చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ దఫా ఆ పార్టీ నుంచి ఎక్కువ మంది పోటీ చేసేందుకు సిద్ధమవుతుండగా టీఆర్ఎస్, బీజేపీ తరఫున కూడా పోటీ చేసేందుకు ఎక్కువ మంది సన్నద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీలతో పాటు మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌కు పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లను చేసుకుంటున్నారు. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉండటంతో ముందస్తుగా మాత్రం గ్రామాల్లో నేతలు అందుబాటులో ఉంటూ ఈ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవి కీలకమైనది. అన్ని పనులు ఆయన ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. అభివృద్ధి పథకాలన్నీ సర్పంచ్ ఆధ్వర్యంలోనే కొనసాగిస్తారు. ఐదేళ్ల పాటు పనులు చేసే అవకాశం ఉండటం పదవికి విలువ కూడా ఉండటం వల్ల ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఉత్సాహం చూపిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతున్నా ఎక్కువ మంది ఆయా పార్టీల బలపర్చిన నేతలే ఎన్నికవుతున్నారు. ఆయా పార్టీల్లో పనిచేస్తున్న నేతలు గ్రామస్థాయిలో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రిజర్వేషన్‌లకు అనుగుణంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు ఎన్నికలు పార్టీల సింబల్ పైనే నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చాలా మంది సన్నద్ధమవుతున్నారు. రిజర్వేషన్‌కు అనుగుణంగా మండల స్థాయిలో మండల అధ్యక్షునిగా ఎంపికయ్యే అవకాశం ఉండటంతో కీలక నేతలు ఈ పదవులపై దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన సమయంలో పార్టీ టికెట్‌పైన పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా ప్రజాపరిషత్‌కు జడ్పీటీసీగా పోటీ చేసేందుకు ఎక్కువ మంది సిద్ధమవుతున్నారు. జిల్లాలో కీలకమైన ఈ జడ్పీటీసీగా ఎంపికైతే రిజర్వేషన్‌కు అనుగుణంగా జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా పనిచేసే అవకాశం ఉండటంతో సీనియర్ నేతలు ఈ పదవులపై దృష్టి పెట్టి పనిచేస్తున్నారు. ముందస్తుగా సిద్ధమవుతూ ఎన్నికల సమయంలో గెలుపుకు ఇబ్బంది ఉండదని అందరూ గ్రామ, మండల స్థాయిలో అందుబాటులో ఉంటూ అవసరమైన పనులను చేపడుతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జరిగే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ దఫా మాత్రం ఎక్కువ మంది గ్రామాల్లో పోటీ చేసే పరిస్థితి కనిపిస్తోంది.

ఆయాచితం నటేశ్వర శర్మ మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు

● జిల్లా సాహితీవేత్తలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 10: సుప్రసిద్ధ కవి తెలుగు సంస్కృత భాషా పండితులు, రచయిత ఆయాచితం నటేశ్వర శర్మ మృతి సాహిత్య రంగానికి తీరనిలోటని జిల్లా సాహితీవేత్తలు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నటేశ్వర శర్మ కన్నుమూశారు. ఈ సందర్భంగా సాహితీ వేత్తలు, సాహితీ సంస్థలు ఆయన మృతికి సంతాపం తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ప్రాచీన కళాశాలలో ప్రధానాచార్యులుగా సేవలు అందించి పలు ఆధ్యాత్మిక, ధార్మిక 50కి పైగ పద్య రచన కవితా పుస్తకాలు, వ్యాసాలు రాసిన వ్యక్తి అని కవి చందన్‌రావు, కాసర్ల నరేష్, కందాళై రాఘవచార్య, గంట్యాల ప్రసాద్, శారధా హన్మాండ్లు అన్నారు.



ప్రశాంత వాతావరణంలో.. నిమజ్జనం జరుపుకోవాలి: కలెక్టర్

● యంచ గోదావరి వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు



● యంచ గోదావరి వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవీపేట, సెప్టెంబర్ 10: ఈ నెల 17న జరిగే గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సహాల మధ్యన జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేన వార్‌తో కలిసి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జానకంపేట, నవీపేటలలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైల్వే ఎలక్ట్రికల్ తీగలు అమర్చబడి ఉన్నందున సంబంధిత రూట్‌లో 8అడుగుల కంటే తక్కువగా ఉన్న గణేష్ విగ్రహాలను మాత్రమే ఈ మార్గంలో తరలించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అంతకంటే ఎత్తైన భారీ సైజు విగ్రహాలను ప్రత్యామ్నాయ మార్గాలలో గోదావరికి తరలించాల్సి ఉంటుందన్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్రకు అవసరమైన అన్ని సదుపాయలను అందుబాటులో ఉంచడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. యంచ గోదావరి బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వన్ వే విధానాన్ని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. పోలీసులతో సమన్వయం చేసుకుని వారి సూచనలను పాటిస్తూ నిర్ధేశించిన మార్గం మీదుగా శోభాయాత్ర జరుపాలని గణేష్ మండపాల నిర్వాహకులను కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, డీపీవో చక్రవర్తుల తరుణ్, మున్సిపల్, ఆర్ అండ్ బీ, అగ్నిమాపక, ఫిషరీస్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

ఆనందోత్సాహాల నడుమ ఉత్సవాలు జరుపుకోవాలి..

ఖిల్లా, సెప్టెంబరు 10: ఆనందోత్సాహాల నడుమ ఉత్సవాలను జరుపుకోవాలని ఎలాంటి వదంతులను నమ్మవద్దని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడి అన్నారు. పరస్పర సహకారంతో గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్-నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్, ఇతర అధికారులతో కలిసి పోలీస్ హెడ్‌క్వాటర్‌లో ఆయన మంగళవారం వినాయక శోభాయాత్రపై సమీక్షించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. నిజామాబాద్‌తో పాటు బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో సైతం నిమజ్జన ఉత్సవం సాఫీగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ మేరకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, శోభాయాత్ర కొనసాగే మార్గాల్లో సీసీ కెమెరాల నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగనేవార్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి అదనంగా మరో 20శాతం వరకు వినాయక ప్రతిమలు ప్రతిష్ఠించడం జరిగిందని, ఇందుకు అనుగుణంగా బందోబస్త్ ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలిపారు. జిల్లా కేంద్రంలోని దుబ్బా ప్రాంతం నుంచి శోభాయాత్ర ప్రారంభం కానుండగా భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే యంచ శివారులోని బాసర బ్రిడ్జి వరకు గల మార్గాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, ఇతర అధికారులు పరిశీలించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కుల గణన చేపట్టి రిజర్వేషన్లను పెంచాలి

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 10: ప్రభుత్వం వెంటనే బీసీ కులగణన నిర్వహించి రిజర్వేషన్‌లను పెంచాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా బీసీ కుల గణనపై ప్రాథమిక చర్యలు తీసుకోలేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కులగణన జరిపి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు పెంచాలన్నారు. బీసీలను మోసం చేస్తుంటే చూస్తు ఊరుకోబోమన్నారు. 75ఏళ్లుగా అధికారంలో ఉన్న అగ్ర వర్ణ పాలకులు ఇంక ఎంత కాలం ఉంటారన్నారు. అధికారంలో, రియల్ ఎస్టేట్ రంగాల్లో, విద్యసంస్థల వ్యాపారాల్లో అన్నింట వారే ఉన్నారని, బీసీలకు సర్పంచ్ పదవులు దక్కితే అనుయహిత్ర ఎందుకని ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. దేశంలో పశువు గణన చేస్తున్నప్పటికీ బీసీ కుల గణన ఎందుకు చేయరని ఆయన ప్రశ్నించారు. సమగ్ర కుల గణన చేసి బీసీ రిజర్వేషన్‌లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమాలతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని, బీసీలు అందరు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బీసీలు ఉద్యమించడానికి సిద్దంగా ఉన్నారని, ప్రభుత్వం వెంటనే కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల సమగ్ర కుల గణనకు రూ.150కోట్లు కేటాయించినప్పటికీ ప్రాథమిక చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీసీలను మోసం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదని, బీసీలంత ఏకమై మరో ఉద్యమం చేపడతారని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా స్పందించి బీసీ కుల గణన జరిపి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను ఆర్మూర్ బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ నేత, ఓయు విద్యార్థి నాయకుడు రాజారాం యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండవీటి శ్యామ్‌ప్రసాద్; మాజీ ఎంపీపీ మోతె రామాగౌడ్, వివిధ మండలాలకు బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీని విస్తరించేలా ప్రణాళికలు

● ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం.రెడ్డి



ప్రతిభ కనబర్చిన క్యాడెట్‌లకు బహుమతులను అందజేస్తున్న కమాండర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: జిల్లాలో ఎన్‌సీసీ నిర్వహణ పని తీరు బాగుందని, ఇంకా ఎన్‌సీసీని విస్తరించేలా ప్రణాళిక చేస్తున్నామని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం.రెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మంగళవారం జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో గల ఎన్‌సీసీ హెడ్ క్వాటర్‌ను తనిఖీ చేశారు. మొదటగా డీడీజీ వీఎం. రెడ్డికి క్యాడెట్‌లు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2022 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేయలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న డైరెక్టరేట్ ప్రస్తుతం పనిచేస్తుందన్నారు. రెండు వేర్వేరుగా విడిపోవాలన్నారు. అనంతరం ఎన్‌సీసీలో ప్రతిభ కనబర్చిన క్యాడెట్‌లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్నల్ సునీల్ అబ్రహం, తొంగే పాటిల్ కెడి, కౌస్తవ్ మహంతి, 12వ బెటాలియన్ ఆఫీసర్ విష్ణుపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఖిల్లా, సెప్టెంబరు 10: నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బా ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురి నుంచి 8,430 రూపాయలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడుతున్నట్లయితే సమాచారం అందించాలని కోరారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన జిల్లా నేతలు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 10: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను నగరానికి చెందిన మైనార్టీ నేత జావెద్ అక్రమ్‌తో పాటు ఇతర నేతలు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వారిలో ధన్‌రాజ్, ఇతర నేతలు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో మొబైల్‌షాప్ యజమాని!

ఖిల్లా, సెప్టెంబరు 10: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన ఓ మొబైల్ షాప్ యజమానిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మంగళవారం నగరంలోని ఓ మొబైల్‌షాప్ ఓనర్‌ను సైబర్ క్రైం కేసులో ఛత్తీస్‌గఢ్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. మొబైల్‌షాప్ యజమాని అకౌంట్‌లో వచ్చిన నగదును ఎలా వచ్చిందని ఆరా తీస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులు సాయంత్రం నుంచి ఆ మొబైల్‌షాప్ యజమానిని విచారిస్తున్నా.. ఈ విషయం బయటకు తెలియరాలేదు. ఈ విషయమై సంబంధిత పోలీసులను ప్రశ్నించగా తమ పరిధిలో లేదని చెప్పడం గమనార్హం. అయితే సైబర్ క్రైంకు సంబంధం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆ దిశగా మొబైల్ షాప్ యజమానిని విచారిస్తున్నట్లు సమాచారం.

బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్స్‌ను మళ్లీ నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 10: జీజీ కళాశాలలో గత సంవత్సరం 5, 6 సెమిస్టర్‌లు కలిగిన విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ను మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ భారత్ రాజును కలిశారు. ఆయనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రాక్టికల్స్ సబ్మిట్ చేయకపోవడం వల్ల విద్యార్థులు ఫెయిల్ అయినట్లు మెమోలో వస్తుందన్నారు. కంట్రోలర్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, కార్యదర్శి ప్రిన్స్, దేవిక, వంశీ, మనోజ్, నిఖిల్ ఉన్నారు.

తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిన చాకలి ఐలమ్మ

సిరికొండ, సెప్టెంబరు 10: తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిన మహిళ చాకలి ఐలమ్మ అని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సిరికొండలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనలో భూస్వాములు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడుతూ తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన తొలి వీరనారీ అని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం ఎనలేని పోరాటం చేసిన మహనీయురాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

















రేషన్ కార్డు లేని రైతుల వివరాలు సేకరించాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్



వర్నిలో వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వర్ని,సెప్టెంబర్ 10: పంట రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని రైతుల వివరాల సర్వేలో నిర్ధారణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ సూచించారు. మంగళవారం రైతు వేదికలో వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడారు. వర్ని మండలంలో 1337మంది రైతులకు గానూ 764మంది రైతుల సర్వే పూర్తయిందని మిగిలిన రైతుల వివరాల సర్వేను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. జిల్లాలో రుణమాఫీ కాని రైతుల వివరాలను అన్న మండలాల నుంచి సేకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పూర్తిస్థాయిలో అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ సిబ్బంది పని చేస్తున్నట్లు చెప్పారు.అనంతరం జాకోర, జలాల్‌పూర్‌తో పాటు వర్ని మండల కేంద్రంలో ఎరువుల గోదాంలను పరిశీలించారు. వ్యవసాయ అధికారి వెంట వర్ని వ్యవసాయ అధికారి దివ్య, ఏఈవోలు అరుణ్, సుదీర్, ప్రవళిక, సీఈఓ రామకృష్ణయ్యలు ఉన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా మోజీరాం

సిరికొండ సెప్టెంబరు 10:పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా కొండాపూర్ పాఠశాలకు చెందిన మోజీరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మంగళవారం సిరికొండలో జరిగిన ఎన్నికల సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు అధ్యక్షుడిగా మోజీరాం, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా శంకర్,కార్యదర్శిగా సంతోష్, మహిళ ఉపాధ్యక్షురాలిగా స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడి మోహన్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ గోపిడి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు లక్ష్మన్ తదితరులు హాజరయ్యారు.

ఇంట్లో కింద పడి వృద్ధురాలి మృతి

కోటగిరి,సెప్టెంబరు 10: పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో రాజబాయి(63)అనే వృద్ధురాలు ఇంట్లో కిందపడి మృతి చెందినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. రాజబాయి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. మంగళవారం ఉదయం 5గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాత ఇంటిలోకి వెళ్లగా కిందపడి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కూతురు రమాబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ధర్పల్లిలో పోలింగ్ కేంద్రం పరిశీలన

ధర్పల్లి, సెప్టెంబరు 10: మండలంలో గల 35 పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలను ఈ సందర్భంగా స్థానిక గ్రామ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను గ్రామాల వారిగా సిద్ధం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే గత ఎంపీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను విభజించి గ్రామ పంచాయతీల వారిగా జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో 8, 10, 12 వార్డులను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయనున్నామన్నారు.

తహసీల్దార్ ఎదుట రౌడీ షీటర్ బైండోవర్

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు10: మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన రౌడీ షీటర్ నర్ర నవీన్‌ను మంగళవారం తహసీల్దార్ కిరణ్మాయి ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. రౌడీ షీటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పలిచి కౌన్సిలింగ్ చేసిన మంచి నడవాడిక కలిగినట్టు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మోర్తాడ్, సెప్టెంబరు10: మండల కేంద్రంలోని మొండివాగులో ఇటీవల భారీ వర్షానికి పని చనిపోయిన వ్యవసాయ కూలీ కాయచోరీ సురేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై సురేష్‌లు మృతుని భార్యకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడానికి సహకరించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డికి, రెవెన్యూ సిబ్బందికి, పోలీసుఅధికారులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయాలని మహిళ నిరసన

బాన్సువాడ, సెప్టెంబరు 10 : అక్రమంగా తమ భూమిని పట్టా చేసుకుని మోసం చేసిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఓ మహిళ తన పిల్లలు, భర్తతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. అదే విధంగా సోమవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కూడా మహిళ కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. జుక్కల్ మండలం కౌలాస్ గ్రామానికి చెందిన పూజ తన తల్లిదండ్రులకు చెందిన భూమిని ఓ వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకున్నాడని, అధికారులు చుట్టూ తిరిగిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ భూమి తమకు ఇప్పించాలంటూ ఆమె అధికారులను కోరారు. లేనియెడల తమ భూమి తమకు వచ్చేంత వరకు ఆమరణ దీక్షచేపడతామని ఆమె హెచ్చరించారు.

మూడు మెడికల్ షాపులకు నోటీసులు

లింగంపేట,సెప్టెంబరు 11: లింగంపేట మండల కేంద్రంలోని మూడు మెడికల్ దుకాణాలను నాలుగు రోజుల పాటు మూసివేయాలని ఆదేశాలు జారి చేస్తూ డీఐ రాజరెడ్డి నోటీసులు జారి చేశారు. ఒక మెడికల్ దుకాణంలో నిర్వహకులు మెడికల్ దుకాణం ఒకరిపై నిర్వాహణ మరొకరు చేస్తున్నారని పేరు మార్చుకోవాలని నోటీసు ఇచ్చినా స్పందించక పోవడంతో నాలుగు రోజులు మూసి వేయాలని నోటీసులు ఇచ్చారు. మరో రెండు మెడికల్స్‌లలో రోగులకు ఇస్తున్న మందులు ఏ వైద్యుడు సిఫార్సు చేశాడో తెలియజేస్తూ బిల్లులు రాసిపెట్టల్సి ఉండగా నిబంధనలు పాటించిన మరో రెండు మెడకల్ దుకాణాలను మూసి వేయాలని నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. మెడికల్ దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆయన కోరారు.

ఎస్సీ బాలికల గురుకులాన్ని లింగంపేటకు తరలించాలి

లింగంపేట, సెప్టెంబరు11:మండలానికి చెందిన ఎస్సీ బాలికల గురుకులాన్ని కామారెడ్డిలో నిర్వహిస్తున్నారని దానిని వెంటనే లింగంపేటకు తరలించాలని కోరుతూ ఎస్సీఎస్టీ కమిషన్ వెంకయ్య, విద్యార్థిమోర్చా రాష్ట్రకార్యదర్శి విఠల్‌లు బుధవారం కలెక్టర్‌కు వినతి పత్రం అంద జేశారు. కామారెడ్డిలోని దేవునిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయంలో సరియైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు తెలియజేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్నందున విద్యార్థులు స్నానాలు చేయలేకపోతున్నారని సమస్యల కారణంగా విద్యార్థినిలు మానసిక వేదనకు గురవుతున్నారని తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన

డిచ్‌పల్లి, సెప్టెంబరు 10: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కాలనీలో మంగళవారం పౌష్టికాహారం గురించి ఆరోగ్య, అంగన్‌వాడి సిబ్బంది చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు కథలు, చిత్రాల రూపంలో వివరించారు. విద్యార్థులకు కథల రూపంలో పోషన్ అభియన్ నిర్వహించడం వల్ల ప్రీ స్కూల్‌పై అవగాహన ఏర్పాడుతుందని, వివరించారు.

వినాయక మండపాల వద్ద భక్తుల సందడి



నగరంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిగాల



జక్రాన్‌పల్లిలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: తెలంగాణలో అతిపెద్ద భారీ మట్టి వినాయకుడిని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలన్నారు. ప్రతి యేటా రవితేజా యూత్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. భారీ మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న రవితేజ యూత్ అధ్యక్షులు నీలగిరిరాజు, యూత్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పరాజు, సత్యప్రకాష్, దండు శేఖర్, రవితేజ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలో గణపతి మండపాల వద్ద గణపతి హోమం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.మంగళవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి,పెర్కిట్,ఆర్మూర్‌లోని పలు గణేష్ మండపాల వద్ద సామూహిక గణపతిహోమం,పూజలు నిర్వహించి భక్తులకుఅన్నదానం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ మండపాల్లో వినా యకులకు భక్తులు, సభ్యులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చు కున్నారు.మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద అన్నదానం నిర్వహించగా అధికసంఖ్యలో పాల్గొన్నారు.వినాయకచవితి సందర్భంగా ఎస్సైగ్రామాల్లో పర్య టించి గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్దలతో ప్రశాంతంగా జరుపుకోవాలని మండ పాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

రెంజల్: మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఎస్‌ఐ సాయన్న, ఎంపీవో రఫీ అహ్మద్‌లు సందర్శించారు. గణేష్ నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు చేసి నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లను అమర్చాలని ఎప్పటికప్పుడు ఇక్కడి పరిసరాల కేంద్రాలను ఎరిశీలించి నిఘా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి భాస్కర్, పుష్కర ఘాట్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాములు, సిరాజ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ:మండలంలోని అన్ని గ్రామాలలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వహలకుతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి డీజేల అనుమతి లేదన్నారు. నిమజ్జనం ఒక్కరోజులోనే ముగించాలన్నారు. పోలీసులసహకరించి పండగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, శ్రీధర్, పీసీలు కిరణ్, చంద్రకాంత్, సంజీవరావ్, రమేష్, స్వామి, లింగం, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ మండలం దూప్య తండాలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సంబరాలు చేసుకుంటున్నారు. మహిళలు,యువకులు నృత్యాలు చేస్తూ భక్తులను ఆనంద పరుస్తున్నారు. రాత్రి వేళలో ఆటపాటలతో సంబరాలను అంబరాన్ని అంటే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుకుంటున్నారు. గిరిజన మహిళలు తమ సాంప్రదాయ పద్ధతిలో డ్యాన్సులు చేస్తూ పాటలు పాడుతూ వినాయకులను చూడడానికి వస్తున్న భక్తులను ఆనంద పరుస్తున్నారు.

'చేనేత కార్మికులకు రూ.30కోట్ల రుణమాఫీ'

మోర్తాడ్,సెప్టెంబరు10: రాష్ట్ర సీఎంరేవంత్‌రెడ్డి చేనేత కార్మికులకు రూ.30 కోట్ల రుణాలను మాఫీ ప్రకటించిందని ఆర్మూర్ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంబల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేం ద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ కల్పించడం హర్షనీయమన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన చేనేత కార్మికుల దినోత్సవంలో ఆయన రుణమాఫీ ప్రకటించారని అన్నారు. అంతేగాక వివిధ పథకాల ద్వారా చేనేత కార్మికు లకు బకాయి ఉన్న రూ.290కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించడం పట్ల అయన హర్షం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల తరఫున సీఎం రేవంత్ రెడ్డికి, రుణమాఫీకి సహకరించిన మంత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 12న ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ ఎంపికలు గురువారం నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్, పింజ సురేందర్‌లు తెలిపారు. ఈ ఎంపికలు ఆర్మూర్ పట్టణంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2009 నుంచి 1-1-2011 మధ్యన జన్మించిన వారు అర్హులన్నారు.ఉదయం 10గంటలవరకు మైదానానికి చేరుకోవాలన్నారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదీలలో హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సంఘం కోశాధికారి గట్టడి రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండ్ర అంజుకు సంప్రదించాలని కోరారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



కోటగిరిలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

కోటగిరి,సెప్టెంబరు 10: భారీ వర్షాలకు వరదల్లో నష్టపోయిన ఆంధ్ర, తెలంగాణ ప్రజలను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు, పలు వ్యాపార సంస్థల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో వరద వల్ల తీవ్ర ప్రాణ, ఆస్తినష్టం జరిగి ప్రజలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజయ్య, భూమన్న, రాజేశ్వరి, లింగం, రజిని, సాయాగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: నగరంలోని డి-1 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడిఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. డి-1 సెక్షన్ పరిధిలోని బురుడుగల్లి, బడాబజార్, గురుద్వార్, గాజుల్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రి జూపల్లిని కలిసిన మోస్రా మండల నాయకులు

మోస్రా,సెప్టెంబరు 10: బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డితో కలిసి మోస్రా మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ జిల్లా మంత్రి జూపల్లిని కలిసి మండలంలో ఉన్న స్థానిక సమస్యలపై వివరించామని అదే విధంగా రాబోవు స్థానిక సంస్థల ఎలక్షన్ బీఆర్‌ఎస్ నుండి వచ్చిన వాళ్లకు కాకుండా గతంలో నుంచి పార్టీలో ఉండి పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించాలని నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని కోరడం జరిగిందని బీసీ సెల్ మండల అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జి నారాయణ, ఇంతియాజ్, మోస్రా గ్రామ మాజీ అధ్యక్షుడు సైనాపురం నర్సారెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులున్నారు.



మంత్రిని కలిసిన నాయకులు

గణేష్ నిమజ్జనంలో ప్రమాదాలు జరుగొద్దు



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నందిపేట, సెప్టెంబరు10: జిల్లాలో జరిగే గణేష్ నిమజ్జన శోభయాత్రలో ఏటువంటి ప్రమాదాలు జరుగ కుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు.మంగళవారం మండలంలోని ఉమ్మెడ శివారులో గోదావరి నది బ్రిడ్జిపై గణేష్ ని మజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను, విద్యుత్ లైన్లను తొలగించాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని కలెక్టర్ సూచించారు. అంతే కాకుండా నిమజ్జన వద్ద సీసీ కెమెరాలు, ఫోకస్ లైట్లు, క్రేన్లు, గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆయా శాఖల అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో డీపీవో తరుణ్ కుమార్, ఎంపిడీవో శ్రీనివాస్ రావు, తహశీల్దార్ ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు.

యూనివర్సిటీ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు



ఆర్మూర్‌లో క్రీడాకారిణిలను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు10: ఏషియన్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్ బాల్ పోటీలకు భారత జట్టుకు జిల్లా క్రీడాకారులు గుగులోత్ మమత, అజ్మీర ఇందు, లాకవత్ రాణిలు ఎంపికైనట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మర్కంటి గంగామోహన్‌లు తెలిపారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలో జరిగిన ఓకార్యక్రమంలో భారత యూనివర్సిటీకి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణిలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దంలింగారెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సాఫ్ట్‌బాల్ మహిళ యూనివర్సిటీ జట్టుకు జిల్లా క్రీడా కారిణిలు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. భవిష్యత్‌లో ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనేలా జిల్లా క్రీడాకారులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయమా ఉపాధ్యాయ సంఘం ప్రధానకార్యదర్శి మల్లేష్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు మర్కంటి సుజాత, నవీన్, కోచ్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల వసతి గృహాల తనిఖీ

లింగంపేట, సెప్టెంబరు 11 : లింగంపేట మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని, మైనారిటీ గురుకులం, మైనారిటి కళాశాలను, వసతి గృహాలను మంగళవారం డీఆర్‌డీవో పీడీ మండల ప్రత్యేక అధికారి సురెందర్ తనిఖీ చేశారు. మైనారిటి గురుకులంలో వంటకు ఉపయోగించే కాయగూరలు, ఇతర వంట సమాగ్రి బాగులేవని వాటిని పారవేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీవో మాలహరి ఉన్నారు.

జీవాలకు పరుదు వ్యాధి నివారణ టీకాలు

దోమకొండ, సెప్టెంబరు 10:మండలంలోని అంచనూర్ గ్రామంలో మంగళవారం జీవాలకు పరుదు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శివ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 మేకలకు ఉచితంగా పశుసంవర్థక శాఖ నుంచి వచ్చిన టీకాలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న సీట్లకు 12న తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 10: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీలు గా ఉన్న సీట్ల భర్తీ కి అర్హులైన ఎస్సీ విద్యార్థులకు ఈ నెల 12న ధర్మారం గురుకుల పాఠశాలలో తక్షన ప్రవేశాలు కల్పించబడుతాయని జోనల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులు మాత్రమే ధరఖాస్తులు చేసుకోవాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వారి తల్లిదండ్రుల ఆదాయం 2లక్షలు మించవద్దని, ఈ నెల 12న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ధరఖాస్తులు చేసుకోవాలని జోనల్ ఆఫీసర్ కోరారు. ధరఖాస్తు ఫారంతో పాటు కుల, ఆదాయ, బోనాఫైడ్, మెమో, జత చేయలన్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



ట్రాక్టర్‌ను సీజ్ చేసిన దృశ్యం

సిరికొండ, సెప్టెంబరు 10: తూంపల్లి సెక్షన్ పరిధిలోని గుడిలింగాపూర్ బీట్‌లో అటవీ భూమిని చదును చేస్తుండగా అధికారులు వెళ్లి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సిరికొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 492 కంపార్ట్‌మెంట్ భూమిలో అక్రమంగా అటవీ భూమిని కబ్జా చేసుకొని చదును చేస్తుండగా అందని సమాచారం మేరకు సెక్షన్ అధికారి కృష్ణ, బీట్ అధికారులు నాగేష్, హరీష్, బేస్ క్యాంప్ సిబ్బంది గోపాల్ తదితరులు వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. భూమిని చదును చేస్తున్న నింధితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సెక్షన్ అధికారి కృష్ణ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో వైస్‌చైర్మన్



బైరి లక్ష్మణ్‌ను పార్టీ కండువ వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు10: నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో మంగళవారం బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో వైస్ చైర్మన్ బైరిలక్ష్మణ్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం బైరీ లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్‌చైర్మన్ ఎం.సాయిరెడ్డి, బ్రహ్మణ్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మునిపల్లి మాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు జె.గంగారాం, స్వామి, సాయిరెడ్డి, వంశీ, వినోద్, రాజు, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

'క్రీడల వల్ల మనోధైర్యం కలుగుతుంది'



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, సెప్టెంబరు10: క్రీడలు అనేవి కేవలం శారీరక ధరుఢ్యాంతో పాటు జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినప్పుడు వాటిని తట్టుకొని నిర్భరంగా, మనోధైర్యంగా ఉండడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలో పాత ఉమ్మడి బాల్కొండ, ముప్కాల్, మెండోర మండలాల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లా డుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజం, అన్నింటిని సమానంగా తీసుకోవాలి, అప్పుడే స్పోర్టింగ్ స్పిరిట్ విద్యార్థుల్లో అలవాడుతుంది. పిల్లలు చదువుతోనే కాకుండా క్రీడల్లో కూడా ఎదగడానికి ప్రొత్సహం కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ క్రీడా పోటీలు రాష్ట్ర స్థాయి పోటీల లాగా గొప్పగా ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త దయానంద్‌రెడ్డి, ఎం ఈవో బట్టు రాజేశ్వర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీన్ రెడ్డి,భూమేశ్వర్, నాగంపేట్ శేఖర్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజ్ కుమార్, మల్లేష్, పీఈటీలు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన జడ్పీహెచ్ఎస్ ప్రహరీ

మోపాల్, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మోపాల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీ కూలిపోయిన పట్టించుకునే వారు కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రహరీ కూలిపోవడంతో పాములు, విషపురుగులు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారని అన్నారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల కూడా ఇందులోనే కొనసాగుతుందన్నారు.కూలిపోయిన ప్రహరీను వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

రుణమాఫీ కాని వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ

వేల్పూర్, సెప్టెంబరు10: మండలంపడిగెల, పోచంపల్లి గ్రామాలలో రుణమాఫీ రాని సుమారు 300మంది రైతుల నుంచి దరఖాస్తులను మంగళవారం ఏవోశృతి స్వీకరించారు. ఆయాగ్రామాలలో రైతు బ్యాంకులో రుణం ఉండి రేషన్‌కార్డు లేని వారికి, రుణమాఫీ రాని వారికి ఏవో శృతి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వోలు శ్యామ్, షబ్బీర్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఒకరికి తీవ్ర గాయాలు

డిచ్‌పల్లి,సెప్టెంబరు 10 జక్రాన్‌పల్లి మండలం పడకల్ నుంచి బైకుపై రంగు నారాయణ గౌడ్ సుద్దపల్లి కి వస్తుండగా మెంట్రాజ్‌పల్లి గ్రామ శివారులో ఆర్మూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బైకును ఢీకొనడంతో బైకుపై ఉన్న నర్సుబాయి తలకు బలమైన గా యలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళ వారం సాయంత్రం మృతి చెందిందని ఎస్సై షరీఫ్ తెలిపారు, నారా యణ గౌడ్‌కు బలమైన గాయలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పోం దుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.మృతురాలి భర్తభోజన్న ఫిర్యాదు మేర కు శవాన్ని పంచనామాచేసి పోస్టుమార్టంకు తరలించమనిఎస్సై తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు10: పట్టణంలోని యానంగుట్ట సమీపంలోని మహరాష్ట్రకు చెందిన బాలుప్రకాష్ బోదిలే (40) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగేళ్ల క్రితం మృతుడు బాలు మహరాష్ట్ర నుంచి బతుకు దెరువు కోసం ఆర్మూర్‌కు వచ్చి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్య పిల్లలకు దూరంగా ఉండడంతో తాగుడికి బానిసైన బాలు ప్రకాష్ బోదిలే మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి జయ బాయ్ ఫిర్యాదు మేరకు ఎఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మున్సిపల్ పరిధిలో పలు దుకాణాల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు10: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌తో పాటు పట్టణంలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని స్వీట్ హోం, బేకరీ, పాల దుకాణాలతో పాటు తినుబండరాల దుకాణాలను తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించని దుకాణాల యాజమానులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది ప్రశాంత్, అక్షయ్, రాము, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను గ్రామాల్లో వార్డుల వారీగా త్వరితగతిన పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు10: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాను ఎటువంటి తప్పులు లేకుండా వార్డుల వారీగా త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని సుదర్శన్ నగర్‌తాండా అలాగే పురాణిపేట్ గ్రామాల్లో ఆయన ఆకస్మిక పర్యాటన చేశారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని, అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎంపీవో జావిద్, పాషా, ఏపీవో నర్సయ్య, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్, సెప్టెంబరు10: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. గ్రామానికి సంబంధించి ఐదుగురికి చికిత్స కోసం మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



ధర్పల్లిలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మోర్తాడ్‌లో..



వేల్పూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పెద్దబజార్,సెప్టెంబరు 10:నేటి సమాజంలో మహిళలు చాకలీఐలమ్మ రాణిరుద్రమ, ఝాన్సీరాణీ వీరవనితలను వారి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారయణ అన్నారు. చాకలీ ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని వినాయక్‌నగర్‌లోని చాకలీఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసినివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల పెత్తనంపై ఆమె చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. మహిళలు అన్నిరంగాల్లో దూసుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం మహిళ రిజర్వేషన్ బిల్లు తెచ్చి వారిని అన్ని రంగాల్లో తీసుకెళ్లే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి,బీజేవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తిక్, లక్ష్మినారాయణ, భూమేష్, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● నగరంలో వామపక్షాల ఆధ్వర్యంలో

నగరంలోని సీపీఐ కార్యాలయంలో చిట్యాల చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ హాజరై మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ వీర వనితఅన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురాం, నర్సింగ్‌రావు, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో నేటి తరానికి ఆదర్శం అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీపీ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు విఘ్నేష్, రాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్:మండలంలోని మంచిప్ప గ్రామంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని గ్రామస్థులు ఘనంగా జరిపారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన పోరాటం గురించి గుర్తు చేసుకున్నారు. ఆమె అడుగు జాడల్లో నడుచుకోవాలని సూచించారు. చాకలి ఐలమ్మ గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత అని తొలి భూ పోరాటానికి నాంది పలికారని అన్నారు. వీరమాత, సామాజిక, ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆమె 39వ వర్ధంతిని జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, రజకులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: తెలంగాణ పోరాట వీరవనీత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని జరుపుకున్నారు. దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నైజం ప్రభుత్వ పాల నలో విషునూరి దేశ్‌ముఖ్‌ను ఎదురించి పోరాడిన చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లూరి రాజారాం, బాబురావు, మామిడి గంగాధర్, సాగర్, సదానంద్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ వీరవనీత చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు కొలిప్యాక్ హన్మాండ్లు, నవీన్, తరుణ్, శ్రీనివాస్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు:మండల కేంద్రంలో రజక ఐక్య వేదిక ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మవర్ధంతిని మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు కొత్తింటి నాగభూషణం మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలను బలహీనవర్గాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ధర్పల్లి:మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, గంగారెడ్డి, సురేందర్‌గౌడ్, బాలయ్య, గంగారాం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: తెలంగాణలో భూపోరాటానికి చాకలి ఐలమ్మ నాంది పలికిన వీర వనిత అని చైతన్య యువజన సంఘం నాయకుడు నరేష్ అన్నారు. సిరికొండ మండలం చిన్నావాల్గోట్ గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు..కార్యక్రమంలో రాకేష్,నితీన్,రాము, సాయికుమార్ పాల్గొన్నారు.

రెంజల్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని ఆమె అడుగు జాడల్లో నడవాలని రజక సంఘం నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో మండేల్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాయుధ పోరాటంలో ఎంతగానో కృషి చేసిన ఐలమ్మ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సాయిలు, అశోక్, సుమన్, మోహన్, పల్లెన్న, గణేష్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: తెలంగాణ సాయుధ ఉద్యమ నాయకురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బోధన్ పట్టణంతో పాటు సాలూర మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్ మాట్లాడుతూ తెలంగాణ తొలి భూ పోరాటానికి నాంది పలికిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇల్తెపు శంకర్, అల్లె రమేష్, పాండు, లింబూరి లక్ష్మణ్, బుయ్యన్, కేజీ గంగారాం, పటేల్, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్:మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం రజక సంఘం సభ్యులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఆమె చేసిన సేవలను సంఘ సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు నరేష్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్:పట్టణంలోని దోబిఘాట్ వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్‌మున్నా, మున్సిపల్ కమిషనర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: చందూర్ మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ పోరాట సాయుధ యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఐలమ్మదని ప్రముఖులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విండో అధ్యక్షులు ప్యారం అశోక్, రజక సంఘం అధ్యక్షులు చాకలి సంజీవ్, సాయికుమార్, శ్రీకాంత్, బ్యాంక్ సాయిలు, బాలు, పాల్గొన్నారు.

నవీపేట: భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం మండలంలోని నాళేశ్వర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, చిన్న భీంరెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

సుభాష్‌నగర్:తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలనునిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ జెడ్పి చైర్మన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాదన్నగారి విఠల్‌రావు పూలమాలలు వేసినివాళులర్పించా రు. ఈ సందర్భంగా తెలంగాణ పోరాటంలో ఐలమ్మ పోరాటం మరువరానిదని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక గౌరి రజక యూత్ ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనీత అని గౌరి రజక యూత్ సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివగౌరి రజక యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి:మండల కేంద్రంలో మంగళవారం మండల రజకుల సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల రజక సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణలో భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమెకు ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి, పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షులు దేగాంముత్యం, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షుడు పోలమల్కారెడ్డి,మాజీ సర్పంచ్‌లు శంకర్‌నాయుడు,ఎల్లయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్, మండల రజకులు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ వీరావనిత, భూస్వాములను తరిమికొట్టిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి ని మంగళవారం డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధులు చిన్నోళ్ల నర్సయ్య, శ్రీనివాస్, నర్సారెడ్డి, సుదర్శన్, శాంతయ్య, పాల్గొన్నారు.

ఇందల్వాయి: తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు శ్రీపతి ఆశన్న, దాసు, మధు, బాలయ్య, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్న బాలయ్య, రఘు, కిష్టయ్య, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



శివాలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,సెప్టెంబరు 10: వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు.మంగళవారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపాలను, దేవాలయాలను ఆయన సందర్శించారు. పట్టణంలోని శక్కర్‌నగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, శివాలయంలో సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహంతో పాటు రాకాసిపేట్, భీముని గుట్ట వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంజ్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలోని వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ నియోజకవర్గ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. పండుగ పర్వదినాలలో శాంతిభద్రతలకు ఎటువంటి అటంకం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగల వేళ ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందిగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్య దామోదర్‌రెడ్డి,సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, హరికాంత్ చారి, నాయకులు నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, తలారి నవీన్, రాములు, వేద పండితులు గణేష్ మహరాజ్, మహేష్ పాల్గొన్నారు.

● నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడికి సన్మానం



మారుతిని సన్మానిస్తున్న బోధన్ ఎమ్మెల్యే

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడు ఆర్మూర్ మారుతిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్‌లు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్వగృహంలో పలువురు నాళేశ్వర్ గ్రామస్థులు ఆర్మూర్ మారుతిని ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లారు.నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతి గత సంవత్సరం ఆగస్టు 15న ఆఫ్రికా ఖండంలోని ఎతైన కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించగా ఈసంవత్సరం ఏప్రిల్ మాసంలో మన దేశంలోని ఉత్తర సిక్కింలో ఉన్న మంచు పర్వతాన్ని అధిరోహించాడు. అలాగే గతనెల 17న యూరప్ ఖండంలోని ఎల్‌బ్రాస్ పర్వతాన్ని అధిరోహించిన విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే వివరించారు.ఈసందర్భంగా ఆర్మూర్ మారుతిని ఎమ్మెల్యే అభినందించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశానికి ఆర్మూర్ మారుతిని ఎమ్మెల్యే వెంట తీసుకెళ్లి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్‌తో పరిచయం చేయించారు.ఈసందర్భంగా వారు ఆర్మూర్ మారుతిని సన్మానించారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహయ, సహకారాలు అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాంచందర్, నాళేశ్వర్ మాజీ సర్పంచ్ నర్సింగరావు, ప్రవీణ్, పలువురు నాళేశ్వర్ గ్రామస్థులు ఉన్నారు.

రైలు నుంచి దిగిన వృద్ధుడి అదృశ్యం



కృష్ణమూర్తి(ఫైల్)

ఖిల్లా, సెప్టెంబరు 10 :రైలులో ప్రయాణిస్తూ వృద్ధుడు తప్పిపోయిన ఘటన నిజామాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. వివరాలను రైల్వే ఎస్‌ఐ సాయిరెడ్డి తెలిపారు. ఈనెల 8న వేస్ట్ గోదావరి భీమవరం రైల్వే స్టేషన్ నుంచి కృష్ణమూర్తి తన కుటుంబ సభ్యులతో షిర్డి వెళ్లడానికి రైలులో ప్రయాణించారు. ఈ రైలు ఈనెల 9న రాత్రి 12గంటలకు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అందరు నిదురలో ఉండగా కృష్ణమూర్తి రైలు నుంచి దిగి వెళ్లిపోయాడు. రైలు బాసర వెళ్లగానే మేలుకున్న కృష్ణమూర్తి భార్య చూడగా కృష్ణమూర్తి కనిపించకపోవడంతో వెంటనే తన కుమారుడికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న శ్రీనివాస్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని విచారణ ప్రారంభించిన పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించగా సదరు కృష్ణమూర్తి ఎల్లమ్మగుట్ట కమాన్ లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. ఆయన ఆచూకి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు చెప్పారు. ఆచూకి కోసం 8712658591నంబరుకు సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

రూరల్ ఎమ్మెల్యేకు పీడీఎస్‌యూ వినతి



రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

మోపాల్, సెప్టెంబరు 10: తెలంగాణ విశ్వవిద్యాలయానికి నూతన వీసీని వెంటనే నియమించాలని యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టాలని కోరుతూ మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఆయన క్యాంప్ కార్యాలయంలో పిడిఎస్‌యు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి యూనివర్సిటీలో రెగ్యూలర్ వీసీ లేకపోవడంతో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మైగ్రేషన్, కాన్వకేషన్, మెమోలు దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదని దీని వల్ల విద్యార్థులు పైచదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే వీసీని నియమించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పిడిఎస్‌యు నాయకులు ప్రిన్స్, దేవిక, వంశీ, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:తెలంగాణ వర్సిటీకి రెగ్యులర్ వీసీని ప్రభుత్వం నియామించాలని,వర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులను తీసుకురావలని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డికి పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. గత ఏడాదిన్నరగా రెగ్యూలర్ వీసీ లేక వర్సిటీలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, మైగ్రేసన్, కాన్వకేసన్ మెమోల జారీ లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యార్థులు పై చదువులకు వెళ్లలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, వర్సిటీ విద్యార్థినులు హాస్టల్ సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం సంప్రదింపులు చేసి వర్సిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ వర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రిన్స్, దేవిక, వంశీ, నిఖిల్ పాల్గొన్నారు.

మిత్రుడు మోసం చేశాడని వ్యక్తి ఆత్మహత్య

ఖిల్లా, సెప్టెంబరు 10 :తాను నమ్మిన మిత్రుడు మోసం చేశాడని మనస్తాపానికి గురై వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని ఐదవ టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారం 80క్వార్టర్స్‌కు చెందిన నాగరాజుగౌడ్ (55)అనే వ్యక్తి మద్యం మత్తులో ఉండి కొడుకుతో గొడవ పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజ్‌కు భార్య మాధవితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మాధవి పెద్దమ్మకు సంతానం లేకపోవడంతో ఆమెకు ముత్తకుంటలో ఉన్న 20గుంటల భూమిని మాధవి పేరున రిజిష్ట్రేషన్ చేయిస్తానని చెప్పింది. అందుకు సం బంధించిన రిజిష్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయడానికి తన మిత్రుడు మల్లేష్‌కు అప్ప గించాడు. అయితే నమ్మిన స్నేహితుడు మల్లేష్ మాధవి పేరుపై కాకుండా ఇతరుల పేరుపై ఆ భూమిని రిజిష్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం తెలియడంతో మృతుడి కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన నాగరాజు గౌడ్ సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు.

నేడు ఎస్‌జీఎఫ్ అండర్-19 టేబుల్ టెన్నిస్ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: ఎస్‌జిఎఫ్ అండర్-19 టేబుల్ టెన్నిస్ ఉమ్మడి జిల్లాల ఎంపికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు డీఐఈవో తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు బాల బాలికల విభాగంలో ఉంటాయన్నారు. ఉదయం 10గంటల వరకు మైదానానికి చేరుకోవాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు బోనాఫైడ్‌ను వెంట తెచ్చుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం 9441707080 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అంత్యక్రియలలో పాల్గొన్న మంద కృష్ణ మాదిగ



అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 10: బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తండ్రి శ్యామ్‌రావు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బెల్లాల్ గ్రామానికి వచ్చి సుజాత సూర్యవంశీని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. పాడే మోసి దహన సంస్కరాలు పూర్తయ్యే వరకు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మానికోళ్ల గంగాధర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రమోద్, నాయకులు భూమయ్య, పద్మ, సావిత్రి, ప్రవీణ్, తాడెం అబ్బయ్య, గంధమాల చంద్రయ్య, జాదవ్, ఫకీర్ నాయక్, స్వప్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

సిరికొండ సెప్టెంబరు 10 : అనుమతి లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సిరికొండ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. భువనగిరి పట్టణానికి చెందిన వ్యక్తి తొమ్మిదిన్నర క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు కొండపూర్ గ్రామంలో పట్టుకుని సిరికొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేడు కేశవులు ఆసుపత్రిలో రౌండ్ టేబుల్ సమావేశం

పెద్దబజార్, సెప్టెంబరు 10:జిల్లాలో చెరువులు, కుంటలు, నాళాలు, పార్కుల అక్రమాలు హైడ్రా ఏర్పాటు గురించి అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి.కేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మేధావులు, వక్తలు, జిల్లాలోని నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

బోధన్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 10: బోధన్ పట్టణంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. మట్కా ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 8వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆరు బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74200	రూ.68,400	రూ.890

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ఉరుకు పటేలా (12.50)
: సరిపోదా శనివారం (3.30, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (7.05)
స్క్రీన్-2 : ది గోట్ (10.30, 2.15, 6.00, 9.45)
స్క్రీన్-3 : ది గోట్ (12.15)
: 35-చిన్నకథ కాదు (4.00, 7.05, 10.10)
స్క్రీన్-4 : స్త్రీ-2 (హిందీ) (10.30, 4.20, 10.15)
: స్పీడ్-220 (1.45)
: ఉరుకు పటేలా (7.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (10.35, 4.25)
: సరిపోదా శనివారం (1.20, 7.10, 10.20)
స్క్రీన్-2 : ది గోట్ (10.25, 6.55, 10.25)
: 35-చిన్నకథ కాదు (1.50)
స్క్రీన్-3 : ది గోట్ (12.40, 4.10)
: 35-చిన్నకథ కాదు (7.40, 10.30)

దేవి : ది గోట్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : 35-చిన్నకథ కాదు (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్న యెడల ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిజామాబాద్ - 99490 55399
బోధన్ - 82476 24486
ఆర్మూర్ - 99085 21686
భీమ్‌గల్ - 87123 41176
అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

CLASSIFIEDS

PART TIME JOB
పార్ట్‌టైమ్‌గా దసరా వరకు (12.10.24) పనిచేయుటకు ఇంటర్/డిగ్రీ స్టూడెంట్స్ కావలెను. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డ్, ఫోటో, సర్టిఫికెట్లతో వెంటనే సంప్రదించండి. Inter 400/- Day, Degree 500/- day
అన్షూ షాపింగ్ మాల్, ఆర్.పి.రోడ్, నిజామాబాద్
AJZ

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 25K. క్వాలిఫికేషన్ : ఏదీ డిగ్రీ. ఫోన్ : 8977547749 AJH002651

CHANGE OF NAME
I, ALITE PADMA W/O. ALITE LINGAM (OLD NAME) R/O. H.NO. 1-10, (V)DHAGGI, (M) SADHASHIVANAGAR, (DIST) KAMAREDDY, T.S., HAVE CHANGED MY NAME IS YELETI PADMA W/O.YELETI LINGAREDDY (NEW NAME)
AJZ

CHANGE OF NAME
I, KHAJA AQUEELUDDIN (OLD NAME) R/O HNO:9-18-112, MALAPALLY,NIZAMABAD,T.S. I HAVE CHANGED MY NAME AS MOHAMMAD AQUEEL AHMED (NEW NAME) S/O KHAJA MOINUDDIN
AJZ

CHANGE OF NAME
I, GADDI RAMESH S/O SAYANNA, M/O GANGU GADDI, W/O, SANDHYA GADDI (OLD NAMES) R/O. H.NO.3-50/2, (V) MUNIPALLY, (M) JAKRANPALLY, NIZAMABAD DIST. T.S. I HAVE CHANGED MY NAME AS GAINI RAMESH S/O SAYANNA, M/O GANGU GAINI W/O GAINI SANDHYA (NEW NAMES)
AJZ

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282